# పంట

అందుగుల మొండయ్య

తూరుపుదిక్కు ఎర్రిడాలు చిత్రంగా అంతకంతకు బంగారురంగుకు దిరుగు తోంది. ఎర్రిడాలుమీద మచ్చల్లాగా గోరెంకలు కిలకిలమనుకుంటూ ఎగురుతున్నాయి. గోరువంకలకు పైభాగంలో చిలుకలు అదేపనిగా అరుస్తూ ఎటో దూరదేశం ఎగిరి పోతున్నాయి. తూరుపు కొండమీది ఊకచెట్ల ఎండుటాకులమీదుగా గాలి బొయ్యిమని బయలుదేరి జొన్నచేన్లమీదికొచ్చేసరికి నెమ్మదించింది. ఊరువాళ్ళంత చిరుతల రామాయణ మేస్తున్నట్లుగా జొన్నకర్రిలు ఊగుతున్నాయి. గువ్వొకటి రెక్కలు టపటప లాడిస్తూ మొగులుకేసి తుపాకిగుండ్లు దూసుకపోయినట్లుగా ఎగిరింది. అంతదాకా తన దగ్గరేఉండి హఠాత్తుగా లేచిపోయిన నేస్తగాని వాలకం అర్థంగాక విప్పచెట్టుమీద మరో గువ్వ గుడగుడ గొణుగుతోంది.

అలాంటి సమయంలో కిలిశెట్టి ఎల్లయ్య కండ్లు పులిపొదుసుకుంటూ మంచెలో కూర్చున్నాడు. అతని బూసుకళ్లల్లో పొద్దుపొడుపు వెలుగు కదలాడుతోంది. చప్పిడి దవడలు కిందకి మీదికి కదులుతున్నాయి. దవడలు అట్లాకదలడంచూస్తే అతను చాలా సేపటినుండి ఏదో మాట్లాడాలనీ ప్రయత్నం చేస్తున్నట్టు కనిపిస్తోంది.... నెత్తికి చుట్టు కున్న పాతగుడ్డపేగు విప్పదీసి మళ్ళీ చుట్టుకున్నాడు. రాత్రెప్పుడో చెక్కుకున్న మొక్కచుట్ట బయటపడ్డది. మంచెకిందికి చూసిండు మంచెకింద నెగట్లో పొగసన్నగా లేస్తోంది. మంచెలో నిలబడి ఒళ్ళిరుసుకొని అర్థంలేని కేకొకటివేసి చుట్టూచూసిండు. మిగతానాలుగు మంచెల మీదోల్లు అదివరకే లేచి ఒడిసెల్లు తిప్పుతూ అరుస్తున్నారు. కడమంచెవాడు ఏదో ఊరుపేరు లేనిపాట కూడా పాడుతున్నాడు. అదేంపాటో వినాలని ఎల్లయ్య కాసేపు చెవులురిక్కించాడు. ఎండిన చొప్పాకులకదలిక, పక్షులఅల్లరి తప్పిస్తే మరింకేది స్పష్టంగా వినిపించలేదు.... గాలి చప్పుడులో అప్పుడప్పుడూ అస్పష్టంగా రాగంమాత్రం విన్పిస్తోంది. చేనుగెట్టుమీద తీగదారుపొదల్లో బొల్లికోడి కురకుర లాడడం స్పష్టంగా విన్పించింది. తను ఒడిశెల గిరగిరతిప్పి అర్రికీకపెట్టిండు. నెత్తి మీద ఎగురుతున్న రామచిలుక కిలకిల లాడింది.

"నీయక్క అందుతె పులుసులేత్తునా?" ఎల్లయ్య మంచెదిగుతూ అన్నాడు. నెగట్లనిప్పు చిదుగబొడిసి మొక్కచుట్టమీద నిప్పుపెట్టుకొని ఎండు పిడుకలు నెగట్లో పారేసిండు. చుట్ట దమ్ములాగి ముక్కుల్లో నుండి పొగతీసుకుంట ఊగుతున్న జొన్న కంకులకేసి చూసిండు. పూనకం వచ్చినవానిలాగా లేచి కడుముంత [illegible] పెద్దగా

తెల్లగా నవనవలాడుతున్న జొన్నకంకిని చెంపలకు రాసుకున్నాడు- ఎందుచేతో బూసు కళ్లల్లో నీళ్లూరినాయి- వంగి మట్టితీసుకొని పిసికిండు.

"ఆగో పడుసుదాని తీర్గ పెకపెక లాడుతున్నవోంట- ఆడవ్మరి నీకేమెరుక, నిన్ను దక్కించుకోను మేమెంత పుల్లెందలబడ్డది- కుండలకాడ పడుండె ఆడిదానసొంటి దానివి.... చత్తెరి ఆడోల్లు కుండలకాడ బడుంటరా? అవ్వ, అక్క, పెండ్లాం, చెల్లె, అదినె, బిడ్డ- అన్నీ నువ్వేకాదు మాకు నీమీద మొకున్న పాపురం దొరోల్లకు, సర్కారోల్లకేమెరుక- అట్టిసాపలు గాల్చుకదినే మొకాలకు సొపలసంగతేమెరుక? కొనంటవా? అహాఁ నాకెరుకలేక అడిగిన...." కాల్లు నిలబొడిసి నేలదిక్కు చూస్తూ మనిషినడిగి నట్లుగా భూమిని అడిగిండు.... జొన్నకర్రిలు "ఔనన్నట్లు" అటూయిటూ ఊగినయ్.

"నాకెరికే నువ్వెట్లకాదంటవ్- నువ్వు నా బంగారెతునుకవుగాదు. ఓపారి నేను గిదేముచ్చెటంటె మామల్లి కోపానికచ్చింది- "నాకంటె ఎక్కువా? అన్నది. 'కాదా మరి' అనినేనన్న- నువ్వు ఇంటివిగద- దానికేమెరుక అగ్గానెంబున్నది- నువ్వంటెనే గదా నుల్లయినా ఎల్లదైనా బతికేది? మాఅయ్య సచ్చేతాకానున్నదో? 'వారీఎల్లా' కన్నతల్లికన్న- కట్టుకున్న పెండ్లానికన్న దునియల మరేదేనికన్నా భూదేవర గొప్పరా? గ బూదేవరను నమ్ముకుంటె బతుకుతావన్నడు. కష్టంల సుకంల దగ్గరకిదీసేది నువ్వేగదా? నాకెరికే నువ్వుకాదంటవు- గట్లంటె నాకు కోపమత్తది. ఏమనుకున్నవో అఁ...." అప్పటి దనుక పిసికిన మట్టిని ముక్కుదగ్గర బెట్టుకొని వాసన చూసిండు.

"గిప్పుడు నీదగ్గర నిలుసుండి ఏదివడితె గదిఅదురుతున్న కనితల్లే! తొట్టదొల్త నువ్వు గిట్లుంటివా? బట్టల్లేని, తలసవరులేని పెయ్యంత పుండ్లుదినేసిన పోరితీరు గుంటివి. మేమంత పెట్లుగొట్టి పొదలుతవ్వేసి- రాల్లురప్పలేరేసి- దూసిబొట్టుబెట్టి సక్కని సుక్కను జేసినంక వాని సెక్రికండ్లనోల్లె ..." తుపుక్కున ఊంచిండు.

"తూఁ వానిపుటుకలమొ.... ఏఘడియలబుట్టిందో? అనికంల్లె పడనేపడ్తివి ఆదేమన్న ఏలుకునే మొగోడా? ఆదేమన్న సాదిసవరచ్చెన జేసినోడా? నీతీర్గ ఎంద రిని పెరబట్టిండు- అందరూకున్నరుగని- పిల్లో! మేమేమన్న సాతగానోల్లమా? మాయింట్లపిల్లను ఆదెత్తుకపోతనంటె ఎట్లూకుంటం. నీయక్క నెత్తురుదొల్లాడుతేంది? సచ్చిందోనాడు పుట్టిందోనాడు- తెగిచ్చినం. ఎట్లూకుంటంబిడ్డా! ఎట్లూకుంటం-ఏడ్పు కుంట కోతకుబోయె గొడ్డుతీర్గబోతాంటె మామనుసు నీల్లయిపోదా? అయ్యింది గన్కనె అడ్డందిరిగినం- గిసొంటి అన్నాయెం సూడలేకెపిలగండ్లు.... ముద్దుగ మేము

156

సారులనుకున్నం- గ సార్లు మాఎంటున్నరు- కండబలంమూదైనా ! కష్టైబలం మాదయినా ? గురినేర్పిండ్లు- పిల్లోనూసినవా అనితెలివి- దున్నంగ- దోకంగ- ఇత్తునంబెట్టంగ- కావలిగాయంగ- గియ్యన్నెందుకు సారెదునెత్తుకు పురిషెడుచేసు కోంగ సప్పుడుచెయ్యలేదు. తీరా నోటికాడికచ్చినంక గుండగాళ్ళను దీస్కొని నీమీద పడ్డడు పడితేమయ్యింది ? పురెల్లు పురెల్లు బలిగినయ్. వానిచెత్రికండ్లనోళ్లైతెడ్డు- గెట్టుమీన సికిలేటుతాక్కుంట నిలుసున్నడు మేం తన్నులాడుకోంగ నాకెపకలేదను కున్నవ నువ్వుసైగజేసినవ్- బస్‌గంతే- చేతికందిన పెళ్ళలందుకొని ఇసిరికొట్టినం. ఇంగుంటెనా ? ధోతి కాళ్ళకడ్డంపడి తట్టుకోంగ ఒకదెబ్బఉరుకుడు- పిల్లో గది తలుసు కుంటె గిప్పటికీ నవ్వాగది- ఇంటన్నవా ? ఏదో సక్కారిన్నట్టు ఆనిచ్ఛఆదే ఒర్రి కుంటడను కుంటన్నవ- గ పప్పులేం నాదగ్గెర ఉడుకయి ఎరుకయ్యిందా ? గిడెవ్వ డోంటా ? మండసొమ్ములు మంగళారతనే కోమటోడుగాదు- దొంగలెక్కలురాసే పట్వారి బక్కనారిగాడుగాదు- మండిబూములు గుంజుకునే బట్టెబాజి దొరోడుగాదు- భూమిదున్నిబతికే కిలిశెట్టి ఎల్లడు"

ఎల్లయ్యకు దగ్గరలోనే పుట్టగడ్డ గుంపుకర్రెలమీద గోరెంకలువాలి అల్లరి చేసుకుంటూ జొన్నకంకులు పొడుచుకతింటున్నాయి- తలెత్తిచూసి ఉలిక్కిపడ్డడు.

"ఓరి నీయవ్వల కుక్కల్‌దె.... మరిసిపోయి మాపు పెండ్లాన్ని అత్తాని పిలిసి నట్టున్నది ఎవారం.... ముచ్చట సంబురాన దొంగతిండిమరిసి నట్టయ్యింది ఎవారం- లే....లే.... మిమ్మల గద్దతన్న లే....లే...." చేతులాడిస్తూ చేతులో ఉన్నమట్టి విసిరిండు. గోరెంకలు అరుస్తూలేచిపోయినయ్.

పక్కమంచెవాడు కేకేసి "వారీ! ఎల్లన్న-నీను దొంగల్ దొడువ గాన్నేఉన్నవ్ పిట్టలకు బెట్టినవా ? నీకుపిస్సలేత్తదిగని- మన్ను బిసుక్కుంట దిరుగుతవుగని" అరిచిండు.

"అడిదాకత్తె మంచెకింద ఎత్తేత్త కొడుకా! నాకాదా పిస్సలేసేది- భూదేవరను నమ్ముకోనోనికి పిస్సలేత్తదిగని ..." మునికాళ్ళమీదలేచి నిలబడి అరిచిండు నెత్తిమీద ఊగుతున్న జొన్నకంకుల్లోనుండి ఆమాట బయటకు పోనేలేదు.

"వాని కేమెరుక తల్లీ! కట్టం సుకం- పడుసోపెకుసో అంటున్నడు- తొట్ట దొల్త ఏమంట ఇత్తున మేసినమో ? గప్పుడు షురువయ్యింది పుల్లెందల- కాదంటవా? మూడేండ్లు దొరోన్ని అనిబలగాన్ని తిప్పికొడ్తిమి. పూసెంటుండి మా గుడిసెల్లపండి అంబలి గడ్కదాగిన సారులు మల్లకనిపియ్యలే....గిది గిప్పటిమాటా ? ఏడటోయిండ్లో

157

ఆయేడు మల్లపంట బెడ్తిమి. దొరోడు మల్లరానే అచ్చిండు. ఈపారి మాదాంట్ల కష్టదొక్కలోల్లను పేరదీసిండు. అనికడుపుల మన్నుబొయ్య ఏంజెప్పిండో? ఏతల్లి రొమ్మునీకి బతికిందో గతల్లి రొమ్మువే అమ్ముకున్నట్టుగ. ఆల్లు అనితోనే షేరీకైయిరి. పురెల్లిలు బలిగిన పంట దక్కలేదు. ఇంటి దొంగను ఈసురుడైన పట్టలేడని గందుకనే అన్నరుగావచ్చు. మరోక్కఏడు మల్ల తెల్లబట్టలోల్లచ్చిరి. 'మీకేంపర్వలేదు. మీబూమి మీకిప్పిత్తమనిరి. గాంధిపేరో గంగరాయునిపేరో చెప్పిరి. తెల్లకాయిదంమీద దస్కతులు దీస్కపోయిరి.... ఒకల కడుపునొప్పి ఒకలకేంముద్దు. దస్కతులోల్లు మల్ల రాకపోయిరి. ఆట్టిబొక్కలకు కోండిగ్రిగాడు దెబ్బలు బడ్డట్టు దెబ్బలు దింటిమి. సొప్ప మెలుక్కపాయె. ఉల్టా కేసులుబెట్టెకచ్చీర్ల సుట్టు అగస్న పచ్చులోలె తిరిగి తిరిగి సత్తిమి. ఏటా దున్నేటు దోకుడు. ఇత్తునం బెట్టుడు. పిట్టముట్టకుంట. ఏదుగొట్టకుంట. కాపుగట్టి గద్దలకు బెట్టినట్టు ఫసలంతా ఆనికొమ్ముమన్నె బెట్టుకోవట్టె మీదికెల్లి దెబ్బలాయె. కచ్చీర్లాయె. కర్సులాయె గంబల్లాయె. పిల్లో ఆశసావదాయె ఎన్ని షల్లెందులబడ్డ! ఎన్నిపారీలు కచ్చీర్లసుట్టు దిరిగినా నువ్వాకండ్లల్ల గస్పత్తివి పసిపోరని పాల్జీకకుమంటె ఏమయితది. ఏడ్సేడ్సి సత్తది. పసురాన్నిగడ్డి ముట్టకంటె ఒర్రొర్రి సత్తది. మరి జిరాయితిజేసి బతికెటోన్ని నాగలి పాలెబట్టకు. బూమి దున్నకంటెఎట్ల? సర్కారోల్లనోల్లె బ .. సి కొడితె గింత ఇసారం లేకపాయె. వానవ్వల బూకంకూస దెత్తుకపోను. ఓట్లప్పుడు జెండలు బెట్టుకోని సలువబట్టలేసుకొని కండ్లు పులపొడుసు కుంట సాటునాలుజెప్పిరి. అదేంమాట. గాంధెవడో చెప్పిండట. గాంధికేమెరుక బూమి సంగతి? ఎరకలేనోడు ఏదన్న చెప్పుతడు. అడుచెప్పినట్టింటె బూమత్తదన్నరు ఏపుట్టల ఏపామున్నదోనని సూత్తే ఏమున్నది? పుట్టలపాము పడిగిప్పి సరువనేసరిచె... అయింక లాగులోల్లచ్చి అడివిలోల్లకు ఏందో మీదినుంచి దిగచ్చిందని రాసుకపోయిరి. ఎవడచ్చిఏంజేసిందట్లుంచి. ఏడేపన గొంగడి అన్నే పెదలుబట్టె..." ఎల్లయ్య ఇట్లా వదురుతూనే పరధ్యానంగానే జొన్నకర్రలు పావుకొని గెట్టుమీది కొచ్చిండు. దూరంగా జింకలమంద నింపాదిగా నడుస్తూ కనిపించింది.

"అత్తండ్లాబిడ్డా! అయ్యవ్వ దాసబెట్టినట్టు.నీతల్లి...." ఎల్లయ్య జింకలకేసి పరుగెత్తిండు. జింకలు గుబురుపొదల మీదినుండి దుముకుతూ అడివిలో మాయమైనాయి. ఎల్లయ్య ఎగపోస్తూ నిలుచున్నాడు. అతనిముందు చెరువు కాల్వనీళ్లు పారుతున్నాయి. కాలువ నిలివెడులోతున్నది. కాలువలోకిదిగి నీళ్లపుక్కిలించి ఊంచి దోసిలితో నీళ్ళెత్తుకుని తాగి మూతితుడుచుకొని ఒడ్డుమీదికెక్కిండు.

"దొరోడంటె ఏందనుకున్నవ్? సర్కారోడు సెరువుగండిమూపిత్తె గుత్తెదారు మల్లీడె సగండిని సగంబెట్టి గండిమూపిచ్చిండు. కట్టకింది నాతకాని లంజకొడుకుల బూమి పొలమైతె బతికిపోతరు. కడుపుకు రొండుపూటలుదింటె కండ్లు నెత్తికెక్కుతయి.... గయ్యన్ని ఇసారంజేసి నిలిపెడు గాదెంగొట్టి, నాతకానోల్ల కండ్లమీన, కడుపుమీన దుబ్బగొట్టి పెరిపెడునీళ్ళు మైలుదూరంగొంటబొయి కంచెలన్ని పొలాలు జేసుకున్నడు గందుకనే అంటరుగదా! ఉల్లిగడ్డంత దొరోడుంటె ఊరుకుముప్పని-" తువుక్కున కాలువనీళ్ళల్లోఉంచి వెనుదిరిగిండు- అప్పటికే మంచెలమీదివాళ్ళు ఎల్లయ్యను పిలుస్తూనేఉన్నారు.

ఎల్లయ్య అంతూపొంతూలేకుండా గొనుగుతూ చేనుచుట్టు తిరుగుతూనేఉన్నాడు మిగతా కావలివాళ్ళు ఒడిశెలలు తిప్పుతూ, గొంతు బొంగురుపోయేదాకా అరుస్తూ పిట్టల కొడుతున్నారు. ఇవేమిపట్టనట్టు తెల్లజొన్నకరగ్రిలు గాలికి చిందులు తొక్కుతూనే ఉన్నాయి.

o o o o

రాత్రి నిశ్శబ్దంగాఉన్నది.... చెరువులోనీళ్ళు వెన్నెలవెలుగులో తళతళ మెరుస్తున్నాయి. అకాశంలో చుక్కలు పాలిపోయిఉన్నాయి. కట్టమీది ఊడుగుపొదల్లో బండకెక్కెరుగాడు ఉండి ఉండి పలుకుతోంది. కట్టమీది ఊడల మర్రిచెట్టుమీద ఏదో పక్షి పడకకుదరక రెక్కలు తపతపకొట్టుకొంటోంది. చెట్టుకింద చీకట్లో చుట్టలు వెలుగుతున్నాయి- చెట్టుకింద దుమ్ములో చాలామంది పెయికంగిలేనోల్లు కూర్చున్నారు. కిలిశెట్టి ఎల్లయ్య చెట్టుమొదలుకొరిగి నోరుతెరిచి గుర్రుకొడుతున్నాడు.

బక్కగా కంకబొంగులాగున్న యువకుడొకడు వాళ్ళమధ్యలో కూర్చున్నాడు.

"అందరచ్చినస్టేనా ?" యువకుడు.

"ఆఁ.... రావల్పినోల్లంత అచ్చిండ్లుసారు" చెవులమీదికంటా వెంట్రుకలు పెరిగినవాడు ఆవులించి అన్నాడు.

"ఓరినీ- దున్నపోతునిదుర-లేలే...." కిలిశెట్టి ఎల్లయ్యను ఎవదోపట్టిఊపిండు

"ఇంటికాడ సీకట్ల పొల్లగండ్ల పండబెట్టచ్చిన జెప్పనకానియ్యిండ్లి" చీకటిలాగా నల్లగాఉన్న ఓ చింపిరితల తల్లి నెత్తి ఆదరబాదర గోక్కుంటూఅంది.

"రేపు సేను కోతబడుదాం.... దొరోడు ఈసారి పోలీసోల్ల ఎంటేసుకత్తడని సమ్మయ్య కబురుదెచ్చిండు- మీరు ఇరువయేండ్లబట్టి మీ పెముట, నెత్తురు- పేసిన కట్టం ఎత్తుకపోంగ సూసుకుంట కూకున్నరు."

"ఎందుకూకున్నం మాపెత్తలు మూడు దెబ్బల మచ్చలున్నయి." ఎల్లయ్య అడ్డుతగిలాడు.

"పనరాదుర ఎల్లన్న సూమ- సారును పురాగ సెప్పనియ్యి" గట్టయ్య.

"నేనేమంటన్న ఉన్నమాటంటన్న."

"నిజమే మీరు పెనుగులాడలేరనిగాదు- అట్టిగనే వానికి పంటప్పజెప్పి పేతులు ముంగటబెట్టుకున్నరనిగాదు- ఫలితమేమయ్యింది?"

"గట్టుకుమోసిన కట్టెలయ్యింది" పిల్లతల్లి.

"గట్ల ఎందుకయ్యింది? అన్నదే మనం ఇసారంజేయాలే- దెబ్బలేగాదు జేల్లకు కూడా పోయినసంగతి నాకు తెలుసుగదా!"

"నేనైతే ఇవ్వారకు పద్నాలుగు పారీల జేలుకుబోయిన- ఓపారైతే జేలుకగ్గిదగ్గ నిజామబాదుల- ఆడఇడిసిపెడితె- ఊరికింత అడుక్కుతినుకుంట వడిసచ్చిన...." దుడ్డెగాళ్ళ వెంకులు....

"అవ్వన్ని లసుమయ్య జెప్పినట్టు గట్టుకుమోసిన కట్టెలయినయ్. మరింక ఇక ముందు అట్లకావటానికి వీల్లేదు.... వాళ్ని వానిబలగాన్ని దెబ్బదీయాలె- మనం కొంత ఆలోచించి ముందుగాల్నే అన్ని అనుకొని సిద్దంగావాలె- అదే మనం నిర్ణయించుకోవడానికి ఇవ్వాళ్ళ ఇక్కడ కూడినం.... నిరుడుకొకోన్ని, దొరతెచ్చిన గుండగాళ్ళను తరిమికొట్టినం- ఇయ్యేడు దొరోడు పోలీసోల్ల తెచ్చుకుంటండు-" ఇట్లాగా ఆయువకుడు చాలా చెప్పుకొచ్చాడు.

నడిఝాము తిరిగిపోయేదాకా పంటకోతగురించి- రానున్నప్రమాదాన్ని ఎదుర్కోవడం గురించి తర్జన భర్జనలుచేసి- చేనుకోయడం గురించి దొరతెచ్చే పోలీసులను ఎదుర్కోవడం గురించి ప్లాను నిర్ణయించుకున్నారు.

గోరుకొయ్యలు పొడిచే సమయానికి ఎటువాళ్ళటు లేచిపోయారు.

* * *

నాలుగు రోజుల నుండి జనం కోతలుకోస్తున్నారు. మెదలు కట్టలుకట్టి గూళ్ళేస్తున్నారు. కోతయిపోయింది. ఇంకా ఒక్కనాటికోత కట్టలుగట్టి గూళ్లేసేదున్నది. ఎసారేల్లయ్యింది. కోత అయిపోవడంతో జనం మంచెలకాడ చేరిపోయారు.

నాలుగురోజుల నుండి దొర, దొర బలగం రాగలదని జనం దిక్కులుచూసిండ్లు- జాడాపత్తాలేకపోయేసరికి మరింక రాడని నిర్ణయించుకొని తేలికగాగాలి పీల్చుకొని ముచ్చెట్లు బెట్టుకుంటున్నారు.

ఎల్లయ్య పొద్దటినుండి పట్టపగ్గాలు లేకుండా ఉన్నాడు.... సీసెడు విప్పసారా హూట్‌గతాగి నక్కోరడిగక్కినట్టు వదురుతూ పెళ్ళపెళ్ళకు గూడుగూడుకు అసులదార మోలె పేనంత కలె దిరుగుతున్నాడు.

"ఎల్లడంటె ఏమనుకున్నరార్రి! ఊరాధి ఊరుడు ధరినికొామాదుడు- పాండువ లోల్ల కతల అర్జెనుడు." మంచెకాడివాళ్ళతో.

"అర్జెనా! నీసోకు బాగనే ఉన్నదిగని. కిట్టమూంతెవ్వరో పెప్పకనేపోతివి-" మెల్లెకన్న భీమక్క మెటికలిరిసింది....

"గది తెలువదానే!" తొర్రిపండ్లు బయటపడేటట్టు కిసుక్కుననవ్వి "ఇంకెవలు అగోగాడ సొప్పకట్టలు గడ్డన్న పునసారు.... ఎరుకయ్యిందా?" అన్నడు.

"మీకెందుకు సారతిప్పలు కసేషమంచెసేడల కూసుందురురాండ్లి" భీమక్క కేకేసింది....

యువకుడు రానన్నట్టు చెయ్యూపిండు....

"మరి అల్లిరావో" ఒక పసిపోరి గుడ్లుమిటకరిస్తూ ...

"నువ్వేనేపిల్లా!" ఎల్లయ్య.

"వావ్వోనీతొర్రి మొకానికి నేనా!" పిల్ల.

"రతం దెత్తనేపిల్ల ..." ఎల్లయ్య....

అంతలోనే దుమ్ము రేపుకుంటూ జీబురావడం కనిపించింది. జనం బెదిరి పోయారు. కొందరు ఏటూతోచక కాళ్ల మడతపడుతుండగా అటిటుఉరికారు. విప్ప చెట్లమీద- ఈతచెట్లమీద పక్షులు జీపుచప్పుడుకు అరుస్తూలేచిపోయినయ్ జనం అట్లా గడబిడ పడేటాల్లకు జీపులోనుండి మాధవరావుదొర- ఆరుగురు పోలీసులు దిగారు. పట్టిపెళ్ళలమీద సొలుగుతూ పంటలకాడికినడిచారు.

మాధవరావు చేతులున్న వంకకర్రతోని ఏదో చూపుతున్నడు.

ఎల్లయ్య కండ్లుష్మలపొడిసి మెదలుకడుతున్న వాళ్ళదగ్గరికి ఉరికిండు.

మాటలఅవసరం లేకుండానే పోలీసులు కర్రలెత్తిండ్లు పోలీసుల కాకిబట్టలకు బెదిరి పరుగెత్తుతున్న జనాన్ని అందినవాళ్ళనల్లా కొట్టసాగారు. పిల్లలు మొత్తుకుంటున్నారు.

అంతా అయిదునిముషాలే- మట్టిపెళ్ళల్లోపడి జనం మొక్కుతూ, దెబ్బలుకాచుకుంటూ మొత్తుకుంటున్నారు. ఆరుగురిలో ఒకడు తుపాకీగురిబెట్టి బెదిరిచ్చిండు.

మాధవరావు వంకకర్రెత్తి యువకుడికేసి చూపిండు. ఒక పోలీసోడు కర్రెత్తిండు- యువకుడు తప్పుకోకుంటె ఆ కర్రదెబ్బకు తలపలిగేదే! మిగతావాళ్ళల్లో ముగ్గురు పట్టుకోవడాని ఉరికొస్తున్నారు. తప్పుకున్న యువకుడు పోలీసుకర్ర గుంజుకున్నడు- ఈసారి కర్ర పోలీసుమీదికి తిరిగింది. పోలీసుకు దెబ్బలుకొట్టడంతప్ప తినడంతెలవక బిత్తిరిపోయి మొత్తుకున్నడు- ఇదంతా చూస్తున్న జనానికి హుషారొచ్చింది.

మరోనిముషంలో పోలీసుల కాకిబట్టలు చినిగినయ్. తుపాకిబట్టుకున్న పోలీసోడు మట్టిపెళ్ళల్లోబడి "యాఅల్లా"అని కేకబెట్టిండు- మాధవరావు కాళ్ళకు ధోవతి అడ్డువడుతుండగా కాళ్ళచెప్పులు రాలిపోగా పరుగెత్తిండు.

పడమటిదిక్కు- సూర్యుడు మండిపడుతుండగా జీబెల్లిపోయింది.

ఎల్లయ్య మంచెలదాచుకున్న విప్పసారా మిగిలిందితాగిండు.

"తల్లే! సూత్తివా! సూడు- ఎల్లడంటె ఎందనుకున్నవ్- ఇత్తునం బెట్టెటోడె గాదు- దున్నెటోడెగాదు- పంటబెంచెటోడు- దక్కించుకునేటోడు- నువ్వేం ఫికరు పడకు- నేనుండంగ నీకేంబయంలేదు" తూలుతూ మట్టిపెళ్ళలను చేతుల్లోనికితీసుకొని కసికొద్ది జీపువెళ్ళిపోయినదిక్కు- విసిరిండు.

X X X X

గిలేటు పళ్లెంలోని గడుకముద్ద నోట్లోపెట్టుకోనుబోతున్న మల్లవ్వకు గూడెంల కొట్టుకోల్లు మొత్తుకోల్లు విన్పించినయ్.... హఠాత్తుగాలేచి గుడిశె బయటకొచ్చింది.

బజారులో నెత్తురు కారుతుండగా ఎల్లయ్య ఎగపోస్తూ చేతులూపుతూ ఏదో చెప్పుతున్నాడు మల్లవ్వ గాబరాగా అటుకేసి పరుగెత్తింది.

"గూళ్ళన్ని సత్తెనాశడమైపోయినయ్- గూళ్ళకు అగ్గిబెట్టిండ్లు. మనోల్లను మంచెరగల్లకు కట్టేసిండ్లు- ఎంకటిగాడు తొవ్వసూపుతాంటే మనూళ్ళకత్తుండ్లు- నేను

162

అడ్డతొవ్వలబడిఉరికచ్చిన." ఎల్లయ్య అట్లా చెప్పుతుండగానే కడింట్లో బొబ్బలేచింది. ఊరు ఊరంతా ఉరుకులు పరుగులు బెట్టిండ్లు- పశువులు తలుగులు దెంపుకొని గెబ్బెడ గెబ్బెడ పరుగెత్తినయ్....

పోలీసులు దొరికిన వాళ్ళనల్లా తన్నిండ్లు- గుడిసెల్లోకి జొరబడి కుండలు బోక్కలబయటపారేసిండ్లు-

మరో పదినిమిషాలకు ఊరు ఊరంతా ఏడుపులు- పెడబొబ్బలతో నిండి పోయింది.... ప్రతివాని ఒళ్ళు పికిలిపోయింది.

అందరిని కుప్పేసిండ్లు- పీనుకండ్ల అమీన్ రూలుకర్రతో పొడుస్తూ "మీ నాయకుడెవడుబే" అన్నాడు.

ఒక్కడుమాట్లాడడు. ఒక్కతిపెదివి విప్పదు.... అమీన్ కండ్లు ఎరుపెక్కి కుక్కలాగా మొరుగుతూ బూటుకాలుతో వరుసబెట్టితన్నిండు....

"చెప్పకుంటే మిమ్ముల్నందర్ని పిట్టలగాల్సినట్టు కాలుస్త...." పిస్టలు తీసిండు.

చప్పుడులేదు- అమీన్‌కు దిగచెమట కారుతోంది....

"మారోసాలోంకో...." అరిచిండు....

పోలీసుల బూట్లు టకటక లాడినయ్.... అలిసిపోయిన అమీనునిలుచున్నాడు. అతనికి దూరంగా పాసుపండ్ల ఎంకడు నాలెచూపులుచూస్తూ. ఎంకన్ని సైగచేసిపిలిచిండు

"దొకిలికే నువ్వయినాచెప్పు...."

"ఇందట్లలేదు బాంచెన్"

"నువ్వు అంతేబంచత్...." తన్నబోయి మానుకున్నాడు. మళ్ళీ నిలుచున్న వాళ్ళ దగ్గరికి నడిచిండు- కర్రతో తలలెత్తి చూసిండు....

అట్లా రాత్రియ్యేదాకా కొట్టినోల్లనేకొట్టిండు- తిట్లకులెక్కలేదు. కొందరిని వ్యాన్లకుతోసిండు.

ఊరంతా దొంగలు దోచినట్టుచేసి వ్యానెల్లిపోయింది....

ఏడవడానికికూడా ధైర్యంరానిజనం రాత్రింతా ఆకలికడుపులతో గుడిసెల్లో బిగుసుకపోయి కూర్చున్నారు.

o o o o

అట్లా మొదలయ్యింది పోలీసులు గూడానికిరావడం- వచ్చిన ప్రతిసారి నానా భీభత్సంచేయడం పరిపాటయిపోయింది. రెండవసారొచ్చినపుడు నాయకుడు దొరక

లేదన్న కోపంతో రెండుగుడిసెలు కాలబెట్టారు. ఊరవతలఉన్న మంచినీళ్ళబావిలో మలవిసర్జన చేసిపోయారు. జనానికి చెరువేదిక్కయింది. కొంతమంది గూడెం ఒదిలి పెట్టి అడివిలోనికి తరలిపోయి గుడిసెలువేసుకున్నారు. సారుతో కలిసితిరిగిన వాడొకడు వాళ్ళతో చేరిపోయాడు- మూడోసారి మరొకడు మాధవరావు గులామైపోయిండు. సారుదొరకలేదు. గాలింపు ఆగిపోలేదు....

o o o o

"కొక్కరోకో"అని మొదటిపుంజు గూసింది. మల్లవ్వ ఉలిక్కిపడిలేచింది. తల గోల్లకొట్టుకొని గుడిసెబయటకొచ్చి అవులించింది.... ఇంకా చీకటి చీకటిగానే ఉన్నది.... "తెల్లారెసుక్క బారెడేఎక్కింది. పుంజుకగ్గివల్ల ఎప్పుడు మనాదిబద్దె గప్పుడేకూత్తది" మల్లవ్వ మళ్ళీగుడిసెలోకొచ్చి నేలమీదకూర్చున్నది.... ఎల్లయ్య పెద్దబండి సప్పుడుతీర్గ గురుకొడుతండు- మల్లవ్వకు మలేరియాసోకి సచ్చిన ఇద్దరు కొడుకులు యాదొచ్చిండ్లు- కళ్ళల్లో నీళ్ళూరినయ్

"దేవునిగుల్లె రాయిబడ ఒక్కన్నన్న ఉంచకపాయె-" అనుకున్నది. ఇంతలో గుడిసెవెనుక ఏదో సప్పుడినవచ్చింది....

"కుక్కలో - పిల్లులో...." అనుకున్నది....

"మల్లవ్వా!" ఎవరో పిలుస్తున్నపిలుపు.... మల్లవ్వలేచి ఇంటివెనుకకొచ్చింది. చీకట్లో దడిదగ్గర ఏదో నీడకదులుతంది....

"నేను మల్లవ్వా!"

అగొంతు మల్లవ్వకెరికే....

"అయ్యోబిడ్డా!" ఎనుగుపొరకలు పాపింది....

సారు లోపలికొచ్చిండు....

"కాసంత సాయంబట్టు...."

మల్లవ్వ సాయంబట్టగా గుడిసెలోపలికొచ్చారు....

"అయ్యోబిడ్డా ఏమయ్యింది...." మల్లవ్వ ఆదుర్దాగా పొయ్యిల బూడిదలో వెతికి నిప్పుతీసి పుల్లలేసింది....

"పక్కపల్లెల దాడిజరిగింది. ఉరికచ్చిన- కాలుమలుసుకపోయింది"....సారు....

గుప్పున మంట లేచింది- కుడికాలు చీలమండ గీసుకపోయి నెత్తురుకారుతోంది- ఒళ్లంతా గీరుకపోయున్నది- దుమ్ముతనిండి, దవడలు పీక్కపోయి మరింక కదలడానికి ఓపిక లేనోనిలాగున్నాడు....

"అయ్యో కొడుకా! అళ్ళింట్లపీన్గెల్ల బతుకనిచ్చేటట్టులేదు-" అనుకుంటూనే ఉప్పుకుండ వెతికింది. కుండలో ఒక్క ఉప్పురాయన్నా దొరకలేదు-

బతుకింట్లపీన్గెల్ల సయిసారంలేని బతుకులు- ఉప్పుసుతదొరుకని బతుకులు- కాపుతె కాసంతనొప్పితగ్గు, ఒదులకియ్యకపోసు గొనుగుతూ- "ఏమయ్యలే....లే...." ఎల్లయ్యను పట్టిఊపింది....

"తెల్లారినంక సూద్దాం.... అల్లు ఈగూడానికిసుత అత్తరేమొ?" అంటూదిక్కులు చూసిండు....

ఆగుడిసెలో దాగేటందుకు ఏదిలేదు, ఎల్లయ్యలేచిండు- ఎదురుగా సారును ఆ ఆకారంలోచూసి అతని నిదురమబ్బు ఒదిలిపోయింది.

"ఓ.... భీమింట్లకాసంత ఉప్పున్నదేమొ పట్టుకరాపో" మల్లవ్వ

"ఉప్పుసంగతట్లుంచు- మనోల్లందరికిచెప్పు- మొగోల్ల దరిని గుట్టమీదబడు మను, పక్కూల్లెకు పోలీసులచ్చిండ్లు" సారుచెప్పిండు.

ఎల్లయ్య గుడిసెబయటకునడిచిండు- మల్లవ్వకు "నూనెన్నా ఉంటెబాగుండు ననే" ఆలోచనవచ్చింది.

కోడిపుంజు మళ్లాగూసింది- మల్లవ్వ ఉలిక్కిపడ్డది,

గూడెంమొదట్ల ఈలలు వినవచ్చినయ్,

"మల్లవ్వొ అత్తుండ్లు" సారు లేచినిలుచున్నాడు.

"అయ్యో ఎట్లబిడ్డా?" మల్లవ్వ కాళ్లుచేతులు వనుకుతున్నాయి.

"లాభంలేదుమల్లవ్వా! ఈ గుడిసెల ఉండవళంగాదు" కుంటుకుంటూ దడికేసి నడిచిండు.

మల్లవ్వ దడికొయ్యలుబాపింది.... "చెరువుకట్ట తిగెదారుపొదల్లుండు బిడ్డా!" మల్లవ్వ అంటుండగానే కుంటుతూ సారు చీకట్లో కలిసిపోయాడు

సారుచీకట్లో చెరువుకట్టకేసి నడుస్తుండగా గూడెంలోనుంచి ఏడుపులు విన్పించి నయ్....

o o o o

చెరువుకట్టమీది తిగెదారుపొదల్లో కదలలేక సారు కుప్ప కూలిపోయున్నడు- తెలువొచ్చింది- కడుపులో ఆకలికుట్టు అంతకంతకు తీవ్రమౌతోంది- కట్టకు అందురు

దొయ్యల్లో పచ్చగా పొలాల కొసలుకన్పిస్తున్నాయి. మర్రిచెట్టు కొసలు కన్పిస్తున్నాయి. నాలుక పిడుచగట్టుకపోయింది.

చూస్తుండగానే ఎండపొద వెళ్ళిపోయింది– పల్లెలోని పెదబొబ్బలు, అవి ఆగిపోవడం తనువింటూ కదలలేనిస్థితిలో ఇక్కడపడున్నాడు– ఒళ్ల పొగలుచిమ్ముతున్నట్లుగా అన్పించింది.

కొసామొదలులేని ఆలోచనలు మెదడునిండా....

"ఇప్పుడేంచేయడం– ఏప్రజల కోసమైతే తను సర్వస్వాన్ని వదులుకొని వచ్చిండో? ఏప్రజల గుండెలో గుండెగ– మొసళ్లో మొసగ– గంజిగట్టదాగి సేండ్ల వెలుకల్లపన్నడో? ఆ ప్రజలే ఇవ్వాళ్ళ నిర్బంధాల మధ్య బతుకుతున్నారు. తనతో కలిసచ్చిన వాళ్లల్లో దెబ్బలకాగలేక ఒకడు దొరపక్షం చేరిపోయిండు. ఒకడు ఊరిడిసిపోయిండు.... విప్లవం విందు భోజనంగాదు నిజమే– కాని ఇంత కర్కశంగా ఉంటుందా? అంతపెద్ద శత్రువుకు వ్యతిరేకంగా జనాన్నికూడ గట్టడమెట్లా? ఇరువైఏండ్లనుంచే కాదు– జనం వందల సంవత్సరాల నుంచి దగాపడుతూనే ఉన్నారు.... మొదట వీళ్ళతో ఉండి పోరాటం నడిపినవాళ్లు పాలకవర్గాల గులాంలైపోయారు.... ఎవ్వరొచ్చినా పంటదక్కలేదు– భూమిమీద హక్కు దక్కలేదు. పోయినసంవత్సరం పంట దక్కింది.... భూమిమీద హక్కుకోసం పెనుగులాట మొదలయ్యింది. ఈసారి దొర పోలీసులను రంగంలోకి దింపిండు– ఎట్లా? ఈ గండంనుంచి– ఈ దెబ్బలనుంచి, ఈ నిర్బంధంనుంచి బయటపడేదెట్లా? ఓ నాసోదరులారా చెప్పండి!" సారు చెంపల మీదిగుండా కన్నీళ్లు కారుతున్నాయి.... ఈ ఆలోచనలు కొసేపుఆగుతే బావుండుననుకున్నాడు.

పడమటి కొండమీద సూర్యుడు గాయపడిన వీరునిలాగున్నాడు. గుట్టబోరు మీద నెమల్లు ఎగురుతున్నాయి....

సారు మూతిసాచి చెరువుకట్ట మీదిగుండా చెట్లమధ్యనుండి గుట్టబోరు పక్కనుండి గూడానికి వెళ్లేదారికేసి చూస్తూ కూర్చున్నాడు. అతని కళ్ళముందు ఎవడో ముసలివాడు ఖనెల్లు ఖనెల్లున దగ్గుతూ చెమటలు కారుతుండగా కొండను తవ్వుతున్న దృశ్యం.... ఏదో కవిత్వంలోని చరణం.... గుర్తుకొచ్చాయి.

పడమటి కొండమీదినుండి చీకటి దిగుతోంది. మర్రిచెట్టుమీద పైడికంటె భయంభయంగా అరిచింది. గూడానికివెళ్ళేదారి నల్లనాగులాగా మారిపోయింది. చెట్లు

దయ్యాలయిపోయాయి. చెట్లకొసల్లో ఒకటి రెండుచుక్కలు వేలాడదీసినట్టుగా మినుకు మినుకు మంటున్నాయి. కాళ్ళు బారజాపి వెన్ను నేలమీదికొన్నాడు- కుడికాలు సలుపు తోంది. కండ్లకు చీకట్లుకమ్ముతున్నాయి.

సరిగ్గా అలాంటిసమయంలో గూడెందారిలో "ఓరిమొండవ్వో" అన్నపిలుపు అసహనంగా దీనంగా వినిపించింది. సారు ఉలిక్కిపడి దారికేసి చూసిండు కర్రి చప్పుడుతప్ప మరింకేమి విన్పించలేదు. మళ్ళీ అదేపిలుపు ఈసారి మర్రిచెట్టు కింది నుండి విన్పించింది.... అదితనపేరే....

"మల్లవ్వ...." అనుకున్నడు మనసులోనే. లేవబోయిండు బలాన్నంతా కూడదీసుకొని- పండ్లుబిగబట్టి లేచినిలుచున్నాడు- జరజర పాకినట్టుబాధ.

"ఏతల్లిగన్నదోబిడ్డా। కాళ్ళల్లమెదిలినవ్- కండ్లల్లమెదిలినవ్" మల్లవ్వగొంతు పూడుకపోయింది.

"అవ్వా ?" కుంటుతూ పొదలుదాటి కట్టమీదికొచ్చాడు.

"ఏడున్నవ్‌బిడ్డా। నాతండ్రీ ఏడున్నవ్" మల్లవ్వ సారుదగ్గెరికొచ్చి ఒళ్ళంతపునికి చూసింది- మీదపడిఏడ్చింది- అది ఎక్కడిదుఃఖమో ? వెక్కబట్టి నడిపించుకపోయి పెరువులో మురంకడిగింది. గుడ్డపేగుతో ఒళ్ళంతాతుడిచింది.

"బిడ్డా। కూసంతదిను" తనుతెచ్చిన గడుకమూటవిప్పి ముద్దలుపిసికి నోటి కందిచ్చింది....

"మనోల్లు ..."

"అందర్ని పట్టుకపోయిండ్లుబిడ్డా।"

"ఎల్లయ్యనుసుత"

"ఆళ్ళ కొమ్ముగొట్ట రక్తాలుకారంగా తన్నుకుంట తీసుకపోయిండ్లు.... అయినె మరికొంత నంది గుట్టల్లకు బోయిండ్లట జాడాపత్తాలేరు."

"మనం గెలుత్తమంటవా అవ్వా ?"

మల్లవ్వ కాసేపు మాట్లాడలే.... ఆతరువాత ఎలుగురాసిన గొంతికతో "బిడ్డా। నేను నీకు చెప్పేటాన్నిగాదు. నిచ్చమే ఒక్కపారిగాదు నాలుగుపారీలు గూడెం సత్తె నాశిడమైపోయింది అలెక్కన దోసుకోండెన్నడు ?"

"నిజమే కాని అవ్వా"

"గీ పెరువుకింద అరిపొలమే సూడరాదుబిడ్డా! ఎన్నిపారీలు దున్నాలె- నాలుగు పారీలు దున్నాలె- ఇడుగు ఇరువాలు మూడుసార్లుదున్ని నాలుగోపారి కయిలిజేసి జంబు గొట్టి నెలదినాల నుంచి పసిపోరగండ్ల తీరుగ సాదుకచ్చిన నారుబెట్టాలె- అదికి అయిపోయిందా? కండ్లల్ల కనిపాపలు జంపుకొని నీల్లుబెట్టాలె- నీల్లుబెట్టినంత గడ్డిగాదం బడ్తది. కలువాలె అడికే అయిపోయిందా? ఎర్రిబొమ్మడిరోగం, గొట్టపురోగం తాకుద్ది గది ఎరుకజేసుకొని మందుగొట్టాలె- ఎరువెయ్యాలె- ఇయ్యన్ని జేసినమే అనుకో పొలంపండి కోతకచ్చిందే అనుకో! కోసితెచ్చుకవేయాళ్ళకు రాళ్ళవాన గొట్టిందా? సర్వం గంగలగలుస్తది" అవ్వ మాట్లాడలేదు. అప్పటికే పైడికంటె రెండుసార్లు గూసింది.

"ఇది గింతే అయ్యిందంటవా అవ్వా?"

"ఒప్పుకున్న- కని ఒక్కడు పసలు సత్తెనారిదం వ్రతపూజ అయ్యిందని మరొక్కడేడు పొలం దున్నని రైతును మవ్వెక్కన్నన్న సూత్తివా? కొడుకాగిదిగంతే- ఎన్నిపారీలు దెబ్బదిన్నా రైతు దున్నుతనేఉంటడు. పంట బెడ్తనేఉంటడు. దున్నడు బందుజేత్తడా?" మల్లవ్వ ఇంకా ఏదో గొణుగుతోంది....

సారు పనికేచేతులతో మల్లవ్వచేతులు పట్టుకున్నాడు. చెట్లసందుల్లోనుంచి వెన్నెల పాకుతోంది. మల్లవ్వముందు నడుస్తుండగా సారువెనుక నడిచాడు.

వెన్నెలవెలుగులో మరికాసేపటికి గూడెం బజారులో పదిమందిదాకా కూర్చున్నారు.... అందులో కిలిశెట్టి ఎల్లయ్య కూడా ఉన్నాడు....

"నిజమే మనం సానాసార్లు దెబ్బలుతిన్నం. ఎందుకు? చేతులు ముందు బెట్టుకొని కూర్చున్నంగనక. పడేటోడుంటె కొట్టెటోడుంటడు. నోరు మెదుపకుంటె దోసుకునేటోడుంటడు.... ఎదురుతిరగడమొక్కటే కాదు. శత్రువువేసే ఎత్తులుజిత్తులు తిప్పికొట్టాలె- ముల్లును నరుకాలంటె గొడ్డలిగావాలె- ఉత్త చేతులతోని ఏంజెయ్యలేం? ఇరువైఏండ్లనుంచి మనం ఉత్తచేతులతో నున్నంగనకనే వాడు మల్లమల్ల మనమీది కచ్చిండు". ఇట్లాగా సారు చెప్పుతూనే ఉన్నాడు....